ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 20 సంచిక : 10 జూన్ 2015

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥ 150/-
విడి ప్రతి : రూ॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సహృదయం కలగటం ఎలా అని అడుగుతున్నారు. సహృదయం కలగటం చాలా కష్టంతో కూడిన పని. దానికి బుద్ధి మనకు సహకారం చెయ్యాలి. భగవంతుడి నిర్మాణంలో ఈ శరీరంలో ఇంద్రియాలు పెట్టాడు, మనస్సు పెట్టాడు, బుద్ధి పెట్టాడు. ఈ మనస్సుకు, ఇంద్రియాలకు ప్రపంచ విషయాల మీద ఆకర్షణ ఉంటుంది. అవి కంట్రోల్‌లో ఉండటానికి మనకు బుద్ధి సహకారం అవసరం. బుద్ధిని మనం సమానంగా ఉంచుకోవాలి, నిదానంగా ఉంచుకోవాలి. సాధనలో రహస్యం అక్కడ ఉంది. బుద్ధి మనకు సహకారం చెయ్యకపోతే మనం అభివృద్ధిలోనికి రాలేము. నేను మీకు సహకారం చెయ్యనక్కరలేదు, మీరు నాకు సహకారం చెయ్యనక్కరలేదు. మన బుద్ధి నిదానంగా ఉంటే, బుద్ధి సమానంగా ఉంటే బుద్ధి మనకు చేసే సహకారం ప్రపంచంలో ఎవరూ మనకు చెయ్యలేరు. బుద్ధిలో హెచ్చుతగ్గులు లేకుండా చూసుకొంటూ, మనం ఒక మనిషిని చూసినా, ప్రపంచాన్ని చూసినా, పరిస్థితులను చూసినా ఉన్నది ఉన్నట్లుగా చూడగలగాలి. మనలో ఇష్టాలు, అయిష్టాలు, అసూయ, ద్వేషం ఇవి అన్నీ ఉన్నాయి. బుద్ధి సహాయంతో మనలో ఉన్న బలహీనతలు ఏమిటో జాగ్రత్తగా చూసుకోవాలి. ఈ ప్రపంచంలో అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. ఈ శరీరాలు అన్నీ చచ్చిపోతాయి. మనకు బంధువులతో, స్నేహితులతో ఉన్న సంబంధాలు కూడా తాత్కాలికమే. కర్మనుబట్టి మనం ఆ ఇంట్లోకి వచ్చాము. మనం వచ్చిన పని జాగ్రత్తగా చూసుకోవాలి. మనం ఎక్కడా విరోధాలు

పెట్టుకోకూడదు. ఇతరులు మనలను విరోధులు అనుకోవచ్చును. కాని మనం ఎవరితో విరోధం పెట్టుకోకూడదు. అందరూ మనవారే అనుకొంటే అసూయ పోతుంది. ఎవరైనా బాగా ఉన్నవారు ఉంటే చూసి సంతోషించటం, లేనివారు ఉంటే మనకు శక్తి ఉంటే సహాయం చెయ్యటం లేకపోతే ఊరక ఉండటం అంతేగాని తలకు మించిన పనులు చెయ్యకూడదు. మనం ఏదైనా పని చేసేటప్పుడు అసలు మనం చెయ్యగలమా, లేదా, మనం ఎంతవరకు చెయ్యగలము అని ఇవన్నీ బాగా ఆలోచించుకోవాలి. దీనికి చాలా ధైర్యం ఉండాలి. వారు అలా ఉన్నారు మనం అలా ఎందుకు ఉండకూడదు అనుకొంటే ఫెయిల్ అయిపోతాము. మన కాళ్ళమీద మనం నిలబడాలి. అందరూ మనవారే అనుకొంటే ఎవరిమీద మనకు ద్వేషం ఉండదు.

నువ్వు ఏదైనా ఒక మాట మాట్లాడినా, ఒక పని చేసినా, ఆలోచించినా ఇవన్నీ కూడా నీ హృదయశుద్ధికి సహకరించాలి. ఏసుక్రీస్తు ఈ విషయం గురించి చాలా బాగా చెప్పాడు. హృదయశుద్ధి గలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు, వారు మాత్రమే స్వర్గరాజ్యంలో ప్రవేశింతురు అని చెప్పాడు. ఇతరులు నీకు ఏది చెయ్యకూడదు అని నీవు అనుకొంటున్నావో అది నువ్వు ఇతరులకు చెయ్యకు. ఇతరులు నీకు చెడ్డ చెయ్యకూడదు అని అనుకొంటున్నావు కదా అందుచేత నువ్వు ఇతరులకు చెడ్డ చెయ్యకు. పూర్వజన్మలనుండి వచ్చిన వాసనలు మనలో ఉంటాయి. హృదయశుద్ధిగా ఉండాలి అని మనకు కోరిక ఉన్నా లోపల ఉన్న వాసనలు మనలను పాడుచేసేస్తాయి. ఆ వాసనలు హృదయాన్ని కలకలు చేసేస్తాయి. ఎవరి పూర్వజన్మలు వారివి, ఎవరి వాసనలు వారివి. ఒకరికి ఇంకొకరికి సంబంధంలేదు. ఒక ఇంట్లోనే ఒకరికి ఇంకొకరికి సంబంధం ఉండదు. మనలో ఉన్న వాసనలు ఏమిటి అని ఎవరికి వారు పరిశీలన చేసుకోవాలి. ఈ వాసన నాకు ఉంది, దానిని నెరవేర్చుకొనే అవకాశం ఉంది అని అస్తమానూ దానిని రిపీట్ చేస్తే అది బలపడిపోతుంది, అది వచ్చే జన్మకు వచ్చేస్తుంది. నీలో ఏ వాసన ఉంది, ఆ వాసన ఎక్కడ వాలుతోంది, దాని పరిణామం ఏమిటి అని జాగ్రత్తగా చూసుకోవాలి. ఎక్కువ భోగ ప్రవృత్తి వలన వాసనలు పెరిగిపోతాయి. భగవంతుడు నీకు ఇచ్చిన అవకాశాలను పాడు చేసుకోకూడదు. ఆ అవకాశాలను నీ హృదయశుద్ధికి ఉపయోగించుకోవాలి. అందరికి డబ్బు ఇవ్వడు, అందరికి చదువు ఇవ్వడు. ఇచ్చిన అవకాశాలను ఉపయోగించుకో.

మనకు ఎంతోకొంత లోకజ్ఞానం కూడా అవసరం. మనం ఇతరులను ఎవరినీ

మోసం చెయ్యకపోయినా ఇతరులు చేసే మోసంలో పడకుండా ఉండాలంటే మనకు ఎంతో కొంత లోకజ్ఞానం ఉండాలి. మనకు ఎన్ని భోగాలు ఉన్నప్పటికీ ఈ శరీరం ఏదో రోజున చనిపోతుంది. నీకు ధనం ఉందని భోగాలు పెంచుకొంటే శరీరం ఇక్కడ చనిపోయి కాలి బూడిద అయిపోయినా ఈ భోగాలన్నీ వాసనకింద పడి వచ్చే జన్మకు వచ్చేస్తాయి, వాటి వలన మనకు అనేక నీచజన్మలు రావచ్చు. వాసనల వలన ఈ లోకంలో దుఃఖం, పరలోకంలో నరకం. ఇదీ ప్రమాదం. అందువలన బహుజాగ్రత్తగా ఉండండి. వాసన ఎలా పెరుగుతుంది అంటే దానిని రిపీట్ చెయ్యటం వలన అది పెరిగిపోతుంది. రిపిటేషన్ కొంచెం తగ్గించుకొంటూ ఉంటే అది నెమ్మదిగా తగ్గిపోతుంది. బాగా చదువుకొనేవారు ఎలా కష్టపడి చదువుకొంటారో అలాగ హృదయశుద్ధి కోసం మనం కష్టపడి సాధన చెయ్యాలి. రామకృష్ణపరమహంసగారు అంత అభివృద్ధిలోనికి రావటానికి కారణం ఆయనలో కపటంలేదు. లోపల ఒకటి పెట్టుకొని పైకి ఎదుటివారిని మాయ చేసే మాటలు ఏమీ మాట్లాడడు. మనిషిలో కపటం లేకపోతే హృదయశుద్ధి కలుగుతుంది. మాటలోగాని, చేతలోగాని, ఆలోచనలోగాని ఎక్కడా కపటం ఉండకూడదు. సొత్తు అంతా ఈశ్వరుడిదే. మనదంటూ ఏమీ లేదు. కాని ఈశ్వరుడు మనకు కేటాయించిన ఐశ్వర్యంకాని, తెలివితేటలుకాని, విద్యనుకాని సద్వినియోగం చేసుకొంటే మనకు సహృదయం వస్తుంది. అవకాశాలు రాకపోతే ఎవరూ ఏమీ చెయ్యలేరు. అవకాశాలు వచ్చినప్పుడు మనం వాటిని సద్వినియోగం చేసుకొంటే మనకు హృదయశుద్ధి కలుగుతుంది.

రామకృష్ణపరమహంసకు డబ్బు మీద ద్వేషం ఏమీలేదు. డబ్బు ఉంది కదా అని మనం అదనంగా వాసనలు పెంచుకోకూడదు. కాని ధనం ఉన్న కొలదీ ఎక్కువ వాసనలు పెంచుతుంది. అదీ ప్రమాదం అని రామకృష్ణుడు చెప్పేవాడు. నీకు పది లక్షల డబ్బు ఉంది అనుకో, ఆ పది లక్షలు ఇరవై లక్షలు అయ్యింది అనుకో, ఇది వరకు పది లక్షలు ఉండేవి, ఇప్పుడు ఇరవై లక్షలు అయ్యింది అని అనుకోవు, కోటి రూపాయలు అయిపోవాలి అనుకొంటావు. జీవితంలో మనకు భగవంతుడు కేటాయించింది మనకు వస్తూ ఉంటుంది. దానితో సంతృప్తి పడాలి కానీ దురాశ ఉండకూడదు. మన కోరికతో సంబంధం లేకుండా మనకు వచ్చేది తీసుకుంటే దాని వలన మనస్సు పాడవ్వదు. మనం కోరికతో తెచ్చుకొంటే దాని వలన హృదయశుద్ధి తగ్గిపోతుంది. ఇప్పుడు మనం ఇక్కడ కూర్చున్నాము. ఎవరో

అరటిపండ్లు తెస్తున్నారు. మనం తీసుకొంటున్నాము. వారు తేవాలి అని మనం అనుకోవటం లేదు. తెచ్చారు కాబట్టి తీసుకొంటున్నాము. అరటిపండ్లు కావాలి అనే కోరిక మనకు లేదు. అలా కోరిక లేకుండా తీసుకొంటే దానివలన ప్రమాదం లేదు, అది హృదయశుద్ధిని పాడు చెయ్యదు. అందుచేత భగవంతుడు నీకు ఏదైతే ఇచ్చాడో దానితో సంతృప్తి పడి, ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొంటే నీకు హృదయశుద్ధి కలుగుతుంది. దీనికి బుద్ధి మనకు సహకరించాలి. బుద్ధి సహకారం లేకుండా మనం ఏమీ చెయ్యలేము. ప్రతీ మనిషికి ఎంతోకొంత తెలివితేటలు అవసరం. తల్లి తండ్రులు పిల్లలకు డబ్బు సంపాదించి ఇవ్వటమే ముఖ్యం అనుకొంటారు కాని వారికి తెలివితేటలు కూడా నేర్పాలి.

కొంతమంది ఎవరికి ఏమీ ఇవ్వరు. అటువంటివారికి హృదయశుద్ధి కలుగదు. లోభిత్వం ఉన్నవారికి ఇహంలేదు, పరంలేదు. భగవంతుడు నరకానికి వెళ్ళటానికి మూడు ద్వారాలు పెట్టాడు. 1. కోరిక, 2. కోపము, 3. లోభిత్వము. లోభిత్వం ఎక్కువ ఉండటం వలన కూడా వాడు నరకానికి వెళతాడు. మీరు చనిపోయేలోపులో ఒకరికైనా సహాయపడండి అని రామకృష్ణుడు అనేవారు. ఆయనకు ఎనిమిది రూపాయల జీతంలో కూడా ఏబై పైసలు ప్రక్కన పెట్టేవారు. ఎవరికైనా సహాయపడటంకోసం అలా చేసేవారు. రమణమహర్షిగారు ఏమన్నారు అంటే మీరు ఎవరికైనా ఏదైనా ఇస్తే వారికి సహాయం చేసాను, వీరికి సహాయం చేసాను అనుకొంటారు. మీరు ఇతరులకు ఇచ్చింది తిరిగి మీకే వచ్చేస్తుంది. ఇంక మీరు చేసింది ఏముంది? నువ్వు ఇతరులకు ఇచ్చింది నీకే వచ్చేస్తుంది అని తెలియక ఎవరికో త్యాగం చేసాను అని అనుకొంటూ మరల బుద్ధిని పాడు చేసుకొంటున్నావు. రమణమహర్షి గారి సిద్ధాంతం ఏమిటి అంటే నీ కుడిచేతిలో ఉన్న వస్తువును ఎడమచేతిలో పెట్టుకొంటే నేను త్యాగం చేసాను అని నువ్వు అనుకోవు. ఎందుచేతనంటే కుడిచెయ్యి నీదే, ఎడమ చెయ్యి నీదే. అలాగే నువ్వు ఇతరులకు ఏదైనా సహాయం చేసినా ఏదో త్యాగం చేసాను అనుకోకు ఎందుచేతనంటే నీకు నువ్వే ఇచ్చుకొంటున్నావు. ఉన్నది ఒక్కటే. అందుచేత నువ్వు చేయవలసింది ఏమిటి అంటే 1. భగవంతుడు నీకు ఇచ్చిన అవకాశములను హృదయశుద్ధి పొందటంకోసం ఉపయోగించుకోవాలి. 2. మన లోపల ఏ వాసనలు ఉన్నాయి, ఏ బలహీనతలు ఉన్నాయి అని ఉన్నది ఉన్నట్లుగా చూసుకొని, వాటిని తొలగించుకోవటానికి మనం బాగా సాధన చెయ్యాలి. అంతేగాని మనల్ని మనం మోసం చేసుకోకూడదు.

నాకు కాశీ ఎందుకు? గయ ఎందుకు? అయోధ్య ఎందుకు? అమ్మ చాలు అని రామకృష్ణుడు అనేవాడు. ఎక్కడో ఒకచోట నీ మనస్సుకు గురి కుదిరితే ఇతర తలంపులు ఆగిపోతాయి. ఇతర తలంపులు ఆగినప్పుడు వాసనలు కూడా తగ్గుతూ ఉంటాయి. వారు దేవుడిని చూసారు, వీరు దేవుడిని చూసారు అంటారు. అది నిజమే. భావనాబలం ఉంటే చూడవచ్చు. మీరాభాయి కృష్ణుడిని చూసింది, త్యాగరాజుకు రాముడు దర్శనమిచ్చాడు కదా! ఇక్కడ బుద్ధుడు ఒకమంచిమాట చెప్పాడు. మీరు దేవుడిని చూడటం ముఖ్యంకాదు, లోపల వాసనాక్షయం ముఖ్యం అని చెప్పాడు. వాసనా క్షయం అయితే పునర్జన్మలు రావు. మీరు దేవుడిని చూసినా లోపల వాసనలు కనుక ఉంటే అంతులేని జన్మలు వచ్చేస్తాయి. లోపల వాసనలు పూర్తిగా నశించాలి. లోపల వాసనాక్షయం అవ్వకుండా మీరు దేవుడిని చూసినా ప్రయోజనం లేదు. ఇవన్నీ అనవసరం గొడవలు అని చెప్పాడు. దేవుడు ఉన్నాడా లేడా అనేది సమస్యకాదు. మిమ్మల్ని మీరు బాగుచేసుకోండి. ఇంక కొత్త శరీరాలు రాకుండా ఉండటానికి అంటే పునర్జన్మలేని స్థితిని పొందటంకోసం ఈ శరీరాన్ని ఉపయోగించుకోండి, అదీ బుద్ధుడు చెప్పేది. ఇప్పుడు ఒక వస్తువు పచ్చగా ఉందని ఎప్పుడూ అది పచ్చగానే ఉంటుందని అనుకోవద్దు, అది ఎండిపోవచ్చు. ఇప్పుడు నీ శరీరం బాగానే ఉంది, కొంతకాలానికి ముసలిది అయిపోతుంది, తరువాత చనిపోతుంది. వస్తువులను, మనుషులను ఉన్నది ఉన్నట్లుగా చూడటం నేర్చుకోండి. మీ కాళ్ళమీద మీరు నిలబడండి. వారు అలా ఉన్నారు, వీరు ఇలా ఉన్నారు అని అనుకరణ వద్దు. నువ్వు దేవుడిని చూడటం కాదు, వాసనా క్షయం అవ్వాలి. వాసనాక్షయం అయితే నీకు హృదయశుద్ధి కలుగుతుంది. అదే మన జీవితగమ్యం. వాసనాక్షయం అవ్వాలి అంటే నీ లోపల ఉన్న వాసనలను ఉన్నది ఉన్నట్లుగా చూడగలగాలి. ఇంద్రియాలు, మనస్సు మనిషిని పాడుచెయ్యటానికి చూస్తాయి, బుద్ధి నిదానంగా ఉంటే వాటిని కంట్రోల్ చేసుకోవచ్చు.

ఈ సృష్టి మనం పుట్టకముందు ఉంది, మనందరం చనిపోయాక కూడా ఈ సృష్టి ఉంటుంది. ఇది ఇలాగే కంటిన్యూ అవుతూ ఉంటుంది. ఈ సృష్టికి యజమాని భగవంతుడు. భగవంతుడు ఎంతకాలం నిత్యంగా ఉంటాడో అంతకాలం ఈ సృష్టి అలా జరుగుతూనే ఉంటుంది. ఈ సృష్టిలోనికి మరల మనం రాకుండా ఉండాలంటే మనం హృదయశుద్ధిని పొందాలి. హృదయశుద్ధి గలవారు ధన్యులు, వారు మాత్రమే స్వర్గరాజ్యమును పొందెదరు. ఎవరికైనా పేచీలు వస్తే కొంతమంది ఆ పేచీలను పెంచేస్తారు. సమాధానపరచువారు

ధన్యులు, వారికి కూడా కొంత హృదయశుద్ధి కలుగుతుంది. ఆ పేచీలు ఎందుకు వస్తున్నాయో ముందు నువ్వు అర్థం చేసుకొని అప్పుడు సలహా చెప్పాలి. అది వారు వినకపోతే వేరే విషయం. మన డ్యూటీ మనం చెయ్యాలి. మనం ఎవరికైనా అరటిపండు ఇస్తే వారికి అరటిపండు ఇచ్చాము అనుకొంటాము, అది జ్ఞాపకం పెట్టుకొంటాము. బుద్ధుడు ఒక రాజ్యాన్ని త్యాగం చేసాడు, వాళ్ల వారసులకు కూడా రాకుండా చేసాడు. అయినా రాజ్యాన్ని విడిచిపెట్టేసాను అనే తలంపు ఆయనకు ఎప్పుడూ రాలేదు. హృదయశుద్ధి కలగటానికి ఎక్కడో ఏదో పాయింట్‌లో నీకు సంతృప్తి ఉండాలి. వాళ్లను వీళ్లను ఏదో అనుకోవటం కాదు. అసలు మన బుద్ధి మంచిది అయితే వాళ్లకు వాటా పెట్టవచ్చును. మన బుద్ధే మంచిది కానప్పుడు వాళ్లకేమి ఇస్తాము. మనకు లేనిది ఇతరులకు ఎలా ఇవ్వగలము. నీలో శాంతి ఉంది అనుకో మాకు ఎవరికి ఇవ్వకూడదు అని నువ్వు అనుకొన్నా అది మాకు వచ్చేస్తుంది. మల్లెపూవు దగ్గర కూర్చున్నప్పుడు ఎవరికి సువాసన ఇవ్వకూడదు అని ఆ పువ్వు అనుకొన్నా ఆ వాసన వచ్చేస్తుంది, అది అంతే. దీనిని ఆటోమేటిక్ డివైన్ యాక్షన్ అంటారు. ఏసు ఏమని చెప్పాడు అంటే నీ కళ్ళు నీకు అపకారం చేస్తూ ఉంటే కళ్ళు లేకపోవటం మంచిది. నీ డబ్బు నీకు అపకారం చేస్తూ ఉంటే నీకు డబ్బు లేకపోవటం మంచిది. అవి నీకు అపకారం చేస్తూ ఉంటే అవి నీకు ఎందుకు అంటున్నాడు. డబ్బు చెడ్డదికాదు, కళ్ళు చెడ్డవి కావు. కాని వాటి వలన నువ్వు పాడైపోతూ ఉంటే అవి నీకు చెడ్డే కదా! నీ కన్ను నీకు అపకారం చేస్తూ ఉంటే తీసి బయట పడెయ్యి. జీవితం పొడుగునా నరకంలో ఉండటం కంటే కన్ను పోవటమే మంచిది కదా! ఇవన్నీ విన్నప్పుడు ఏదో చెపుతున్నాడు అని మనకు అనిపిస్తుంది కాని ఇది నూటికి నూరుపాళ్ళు సత్యం. ఎందుచేతనంటే ఇవి వారు ఆలోచించి చెప్పిన మాటలు కాదు, ఊహించి చెప్పిన మాటలు కాదు, కీర్తి కోసం ఓట్లకోసం చెప్పిన మాటలు కాదు. వాళ్ల హృదయంలో ఈ విషయాన్ని దర్శించి నీకు చెపుతున్నారు.

అందరూ మనవాళ్ళే అనుకున్నప్పుడు మనకు ఎక్కడా అసూయరాదు. మీ అబ్బాయి వందకోట్లు సంపాదించుకొంటే నీకు అసూయ వస్తుందా? రాదు. అలాగే అందరూ నీవారే అనుకొంటే ఇంక నీకు అసూయ రాదు. మాకు అన్నీ పోయినా గర్వం పోలేదు అని కొంతమంది అంటూ ఉంటారు. అది లోతుగా ఉంటుంది. గోడలో లోతుగా ఉన్న వస్తువును తియ్యటం కష్టం అలాగే మనలో లోతుగా పాతుకుపోయిన విషయాలను గబుక్కున బయటకు లాగలేము. ఒక మేకు గోడలో బాగా లోపలకు ఉంది అనుకో మనం చెయ్యిపెట్టి

ఇలా లాగేస్తే వచ్చేయదు. అలాగే ఒక వాసన పోవాలంటే నువ్వు ఏదో కృష్ణా, రామా అంటే సరిపోదు. ఆ వాసన తొలగించుకోవటానికి నువ్వు గట్టిగా ప్రయత్నం చెయ్యాలి, సాధన చెయ్యాలి. పరిస్థితులను, వస్తువులను, మనుషులను, సంఘటనలను ఉన్నది ఉన్నట్లుగా చూడటం నేర్చుకో. ఏదైనా ఒక సంఘటన జరిగితే అది అలా ఎందుకు జరిగింది అని ఉన్నది ఉన్నట్లు చూడటం అలవాటు చేసుకో. ఇప్పుడంటే మేము కార్లమీద తిరుగుతున్నాము. ఇంతకుముందు ఎక్కడో పెరవలి దగ్గర ప్రాంతం కూడా సైకిలుమీద వెళ్ళేవారము. ఎందుకు అంతదూరం వెళ్ళినట్టు అంటే టీచింగ్ కోసమే.

నీ ఇంట్లోని అందరూ నిన్ను విడిచిపెట్టేసినా నీ అంతట నువ్వు సుఖంగా ఉండగలగాలి. నీ సుఖంకోసం, శాంతికోసం ఎవరిమీద, ఇంట్లోవారిమీద కూడా ఆధార పడకూడదు. నీకు శాంతి ఎక్కడ నుండి వస్తోందో, సుఖం ఎక్కడనుండి వస్తోందో చూసుకోవాలి. నువ్వు శాంతిగా, సుఖంగా ఉంటున్నావు అనుకో ఏ కారణం వలన మనం శాంతిగా, సుఖంగా ఉంటున్నాము. అది స్వతంత్రమా, అస్వతంత్రమా అనేది చూసుకో. స్వతంత్రమైతే అభివృద్ధి అవుతుంది, స్వతంత్రం కానిది మధ్యలో బ్రేక్ అయిపోతుంది. నీకు సొంతంగా హృదయంలో నుండే వస్తూ ఉంటే పరవాలేదు కాని ఇతరుల మీద ఆధారపడి వచ్చేది మధ్యలో ఆగిపోవచ్చు. ఒక మనిషి భూమి మీదకు వచ్చినప్పుడు మళ్ళీ ఈ భూమిని విడిచి వెళ్ళిపోవాలి. మన ఇంట్లో ఒకో మనిషి చనిపోయినప్పుడు ఎటుచూసినా శూన్యంగా కనిపిస్తుంది. కాని ఆ శూన్యాన్ని కూడా మనం భరించాలి. అలా నువ్వు భరించగలిగితే అది నీ హృదయశుద్ధికి సహకరిస్తుంది. బిల్డింగు కట్టేటప్పుడు గెడలతో పరంజా కడతారు. బిల్డింగు పూర్తి అవ్వకుండా ఆ గెడలను తీసేస్తే మరల గెడలతో పరంజా కట్టాలి. బిల్డింగు పూర్తి అయిపోతే ఇంక ఆ గెడలను తీసేసినా నష్టం లేదు ఎందుచేతనంటే ఇంక పరంజా అవసరం లేదు. అలాగే మనకు జ్ఞానం రాకుండా ఈ శరీరం పోతే మళ్ళీ శరీరం వచ్చేస్తుంది. ఈ శరీరంలో ఉండగానే జ్ఞానం వస్తే ఇంక శరీరం పోయినా పరవాలేదు. జ్ఞానం వచ్చాక ఇంక శరీరంతో పనిలేదు, ఇంక దాని అవసరం కూడా లేదు.

నాకు తిరిగి జన్మ వస్తుందా అని బుద్ధుడిని అడిగారు. నీకు ఆకలివేస్తే అన్నం తింటావు, దాహం వేస్తే మంచినీళ్ళు తాగుతావు. మరి నీకు శరీరం అవసరం ఉందా? అవసరం ఉంటే శరీరం వస్తుంది, అవసరం లేకపోతే రాదు. శరీరం అవసరం ఉందా, లేదా అనేది ఎవరికి వారే చూసుకోవాలి. ఒకవేళ నువ్వు శరీరం వద్దనుకున్నా నీకు లోపల వాసనాక్షయం

అవ్వకపోతే శరీరాలు ఆగవు. మన శరీరాలు అన్నీ విధి చేతిలో ఉన్నాయి. విధి వచ్చిన తరువాత ఇంక శరీరం ఆగదు, చనిపోతుంది. ఈలోపుగ మీరు కాలాన్ని పాడుచేసుకోవద్దు, కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. ఈ రోజున చెప్పింది మీరు కలకాలం గుర్తు పెట్టుకోండి. ఈ రోజున ఈ మాటలు రావటానికి అన్నపూర్ణ కారణం. పని భగవంతుడు చేస్తున్నా ఎవరో ఒకరి చేతిని ఉపయోగించుకుంటాడు. ఎవరో ఒకరి నోరును ఉపయోగించుకుంటాడు. మీ నోటి నుండి ఒక మంచిమాట వచ్చినప్పుడు, మీ మనస్సులో ఒక మంచి తలంపు వచ్చినప్పుడు ఇక్కడ కూర్చున్న వారందరికీ అది ఇష్టం లేకపోయినా ఆ మాటలో తూకం ఉంటే నువ్వు మాట్లాడిన మాట సముద్రాలు దాటి ఇతర దేశాలకు కూడా భగవంతుడు తీసుకొని పోతాడు. నీ ఎదురుగా కూర్చున్నవారు నీ పట్ల అసూయ వలన ఆ మాట మాకు ఇష్టంలేదు అని చెప్పినా ఆ మాటలో విలువ ఉంది కాబట్టి ఆ మాట సముద్రాలు దాటి వెళు తుంది. నీ హృదయంలో ఉన్న నిజం నీ వాక్కు ద్వారా బయటకు వస్తూ ఉంటే ఇక్కడ కూర్చున్నవారు పెద్ద గొయ్యి తీసి ఆ మాటను గోతిలో పెట్టేయాలి అనుకొన్నా అది గెంటుకొంటూ బయటకు వచ్చి కొండలు దాటి వెళుతుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-04-2015 జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం యజ్ఞభావనతోటి పని చెయ్యాలి. మనం స్వార్థం లేకుండా ఏ పని చేసినా అది యజ్ఞమే. కర్మఫలకాంక్ష లేకుండా ఏ పని చేసినా అది యజ్ఞంతో సమానమే. కర్మఫల కాంక్ష ఉండకూడదు అని భగవంతుడు చెప్పాడు కాని ఫలం రాదని ఎక్కడా చెప్పలేదు. మీకు ఫలకాంక్ష లేకపోయినా ఆ ఫలం ఈశ్వరుడి చేతిలో ఉంటుంది, అది ఎప్పుడు ఇవ్వాలో ఆయనే ఇస్తాడు. మనం మాట్లాడేమాటల విషయంలో, చేతితో చేసే పనుల విషయంలో, మన మనస్సులోకి వచ్చే ఆలోచనల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. సాధన అంటే ఏదో అయిదు నిమిషాలకో, పది నిమిషాలకో పరిమితం చేసేది కాదు. మన దైనందిన జీవితంలో మన ప్రవర్తనా విధానం అంతా కూడా సాధనలోకి వస్తుంది. ఏదో పది నిమిషాలో, అయిదు నిమిషాలో జపం చేయటం కాదు, మనం చేసే పని సైలెంట్‌గా చెయ్యాలి. పబ్లిసిటీ ఉండకూడదు. పబ్లిసిటీ వలన లోకంలో మీకు కీర్తి రావచ్చునుగాని మనం ఈశ్వరానుగ్రహానికి పాత్రులం కాలేము. అంటే మనం మాట్లాడేమాట, చేసే పని ఈశ్వర ప్రీత్యర్థంగా ఉండాలి.

సాధన కూడా మన పద్ధతిలో మనం చేసుకోవాలి కాని అనుకరణ పనికిరాదు. ఎవరో ఏదో చేస్తున్నారు అని మనం అలా చెయ్యకూడదు. ఇందులో అన్నింటికంటే మనస్సు ముఖ్యం. అది ఫండమెంటల్‌గా మీరు గుర్తుపెట్టుకోవాలి. మనం బాగుపడినా మన మనస్సే కారణం, మనం పాడైపోయినా దానికి మన మనస్సే కారణం. మన మనస్సు ఒకోసారి విపరీతంగా ఉద్రేకపడుతుంది, ఒకోసారి అణిగిపోతూ ఉంటుంది. ఈ హెచ్చుతగ్గులు అనేవి మనస్సులో వచ్చే వికారాలు. మనకు ఎప్పుడైనా సంతోషం వచ్చినా మనస్సుకే, దుఃఖం వచ్చినా మనస్సుకే, అవి రెండూ నిజం కాదు. అంటే మనస్సుకు వచ్చే సంతోషం నిజంకాదు, మనస్సుకు వచ్చే దుఃఖం నిజంకాదు. సాధన యొక్క ప్రయోజనం ఏమిటి అంటే మన మనస్సును నియమించుకోవటం. ఏ విషయాల కూడా మన మనస్సు బహిర్ముఖమవుతోంది అని జాగ్రత్తగా పరిశీలన చేసుకోవాలి. మనస్సు బహిర్ముఖం అయి ఏ విషయాలమీద వాలుతోందో ఆ విషయాలనుండి మనస్సును వెనక్కి మళ్ళించి దానిని ఆత్మచింతనలో, దైవచింతనలో నియమించటమే సాధన యొక్క ప్రయోజనం. మనమాట, చేత మన మనస్సు అణిగేలా ఉండాలి. మనస్సును క్వయిట్‌గా, కూల్‌గా అట్టేపెట్టుకోవాలి. మనం మహాత్ములం అయినా, దురాత్ములం అయినా దానికి మనస్సే కారణం. మనస్సును బాగుచేసుకొనే విషయంలో మనం తగిన ప్రాముఖ్యత ఇవ్వటంలేదు. మనస్సును పవిత్రం చేయాలి, దానిని ఏకాగ్రం చెయ్యాలి. అవసరం లేని విషయాల నుండి మనస్సును ఉపసంహరించాలి. దానికి సంబంధించిన ప్రయత్నం మనకు లేదు. మనస్సు అణగాలంటే దానికి ఈశ్వరానుగ్రహం ఉండాలి, గురువు అనుగ్రహం ఉండాలి.

పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు అందరూ బాగానే ఉంటారు కాని పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు మనం ఎలా ఉంటున్నాము అనేది జాగ్రత్తగా చూసుకోవాలి. పరిస్థితులు మనకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా కూడా మన మనస్సు సమానంగా ఉండేటట్లు మనం అభ్యాసం చెయ్యాలి. ప్రపంచంలో అందరికంటే శక్తిమంతుడు ఎవడు అంటే రాజ్యాలను జయించినవాడు శక్తిమంతుడు కాదు, మనోనిగ్రహం కలవాడు మనస్సును జయించినవాడు అందరికంటే శక్తిమంతుడు, వాడే ప్రశంసార్హుడు. నీవు ఎంత డబ్బు సంపాదించినా, ఎన్ని గ్రంధాలు చదివినా, ఎంత పాండిత్యం ఉన్నా నీకు మనోనిగ్రహం లేనప్పుడు వాటివలన ప్రయోజనం ఏమీలేదు. నీకు మనోనిగ్రహం లేనప్పుడు మనస్సు అదుపులో నీవు ఉంటావు కాని నీ అదుపులో మనస్సు ఉండదు. నీ మనస్సును నువ్వు

అదుపులో పెట్టుకొంటే, మనస్సును నియమించుకుంటే వాడే ధీరుడు, వాడే వీరుడు. మనస్సు ఎప్పుడైతే అణిగిపోయిందో అప్పుడు మీలో ఉన్న స్వరూపం మీకు వ్యక్తమవుతుంది అంటే చావు పుట్టుకలతో సంబంధంలేని సద్వస్తువు మీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది.

భగవాన్ డే డ్రీమ్, స్లీపింగ్ డ్రీమ్ అని చెపుతూ ఉండేవారు. ఇప్పుడు మనం ఇక్కడ కూర్చుని మాట్లాడుకొంటున్నాము. ఇదంతా కూడా జాగ్రదవస్థలో జరుగుతున్నటువంటి స్వప్నం ఇదీ స్వప్నమే దీనిని డే డ్రీమ్ అంటారు. రాత్రి నిద్రలో మనకు స్వప్నాలు వస్తాయి. దానిని స్లీపింగ్ డ్రీమ్ అంటారు. అది నిద్రలో వచ్చే స్వప్నం, ఇది మెలకువలో ఉన్నప్పుడు వచ్చే స్వప్నం. ఆ స్వప్నంలో తలంపు ఉన్నాయి, నామరూపాలు ఉన్నాయి. ఈ స్వప్నంలో కూడా తలంపులు ఉన్నాయి, నామరూపాలు ఉన్నాయి. అక్కడా సత్యం లేదు, ఇక్కడా సత్యం లేదు. ఈ అవస్థలన్నింటికి ఏ సత్యవస్తువు అయితే ఆధారంగా ఉందో, ఏ సద్వస్తువు మీద ఇవన్నీ తిరుగాడుతున్నాయో దానిని మనవాళ్ళు ఎలా చెప్పారు అంటే సత్యం, జ్ఞానం, అనంతం, బ్రహ్మం అన్నారు. అంటే బ్రహ్మపదార్థం ఒక్కటే సత్యం, అదే జ్ఞానం, అదే అనంతం. నీ దేహంతోటి, ఇంద్రియాలతోటి, మనస్సుతోటి, దేవతలతోటి సంబంధం లేకుండా ఏ వస్తువు అయితే ఇండిపెండెంట్‌గా ఉందో, ఏదైతే నిత్యంగా ఉందో, దేని స్వరూపం అయితే ఆనందమో, సుఖమో, శాంతో, దేని స్వరూపం అయితే జ్ఞానమో ఆ వస్తువు నీ హృదయంలో సహజంగా ఉంది. నీ హృదయంలో ఆ వస్తువు ఎంత సహజంగా ఉందో నీ మనస్సు కూడా అంత సహజంగా, అంత నిర్మలంగా హృదయంలో ఉండగలిగితే అప్పుడు మనస్సు నశిస్తుంది, అక్కడ ఉన్న సద్వస్తువు నీకు వ్యక్తమవుతుంది, అదే పరమస్థితి. అప్పుడు నీవు స్వతంత్రమైన సుఖాన్ని, శాంతిని పొందుతావు. ఇంతకంటే మించిన సుఖంగాని, శాంతిగాని లేదు అనే అనుభవం నీకు కలుగుతుంది. ఇంక అప్పుడు నీవు సుఖంకోసం, శాంతికోసం బయట మనుషుల మీదగాని, బయట వస్తువుల మీదగాని, బయట విషయాలమీదగాని ఆధారపడనక్కరలేదు. ఇక్కడ మనం ఫండమెంటల్‌గా అర్థం చేసుకోవలసింది ఏమిటి అంటే భగవాన్ ఒక మాట చెప్పారు ప్రపంచంలో ఎక్కడా, ఏ వస్తువులోను సుఖం అనేది లేదు. సుఖం అనేది మీ ఆధ్యాత్మిక హృదయంలో తప్పించి బయట ప్రపంచంలో ఎక్కడా లేదు. ఏదో బయట సుఖం ఉందని మీరు అనుకొంటున్నారు కాబట్టి దానికోసం బయట వెతుకుచున్నారు. అది హృదయంలో ఉంది కాబట్టి అక్కడ వెతికితే అది మీకు దొరుకుతుంది కాని దానికోసం లోకంలో ఎన్ని జన్మలు వెతికినా అది మీకు దొరకదు ఎందుచేతనంటే అది అక్కడ లేదు

కాబట్టి. అందుచేత మీరు హృదయంలో వెతకండి. ఇది హృదయవిద్య, ఇది సత్యాన్వేషణ.

మన మనస్సు నిర్మలం అవ్వాలి. మనస్సు నిర్మలం అవ్వాలి అంటే అది మన ప్రవర్తన మీద ఆధారపడి ఉంటుంది. మనకు ఉద్రేకం వచ్చినప్పుడు అది ఒక్కటే నిజం అనిపిస్తుంది. ఎవరి మీద అయినా కోపం వచ్చినప్పుడు అది ఒక్కటే నిజం అనిపిస్తుంది. అదే మాయ. అంటే మనకు ఏ తలంపు వచ్చిందో ఆ తలంపు ఒక్కటే నిజం అని అనిపిస్తుంది అంతే. మనకు మంచితలంపులు రానివ్వండి, చెడుతలంపులు రానివ్వండి, మనకు ఎటువంటి తలంపులు వచ్చినా ఈ అన్ని తలంపులకు లోపల అడుగున దేహమునేను అనేతలంపు కామన్‌గా ఉంది. దేహమునేను అనే తలంపు లేకపోతే నీకు ఇతర తలంపులు ఏమీరావు. ఇది మీరు గుర్తుపెట్టుకోండి. దేహమునేను అనే తలంపు మనకు లోపల ఉంది, దానిని బేస్ చేసుకొని మిగతా తలంపులు వస్తూ ఉంటాయి. ఈ ప్రపంచం భౌతికమా, ఆధ్యాత్మికమా అంటే ఇదంతా ఏమీ లేదు. అసలు భౌతికం అంటూ లేదు. ఉన్నదంతా ఆధ్యాత్మికమే. మనకు దేహబుద్ధి ఉండటం వలన మనం కూడా దేహాలు అనుకొంటున్నాము, లోకం లోకంగానే మనకు కనిపిస్తోంది. ఈ దేహబుద్ధి పోయిన వెంటనే అసలు భౌతికం అంటూ ఏమీ లేదు, ఉన్నది ఆధ్యాత్మికమే అనేటువంటి అవగాహన మనకు కలుగుతుంది. ఇంద్రియ నిగ్రహానికి, మనోనిగ్రహానికి గురువు కృప అవసరం, ఈశ్వరుని యొక్క అనుగ్రహం అవసరం. అందుచేత మనం మాట్లాడేమాట, చేసే పని, మన ఆలోచనా విధానం అంతా కూడా ఈశ్వరుని యొక్క అనుగ్రహం పొందేటట్లుగా ఉండాలి.

రాగద్వేషాలు కూడా పొంగులు, అవి నిజంకాదు. అవి మనస్సులో వచ్చే వికారాలు. భయం కూడా ఒక వికారం. నా శరీరమే నేను అనుకొన్నప్పుడు ఎదుటివాళ్ళ శరీరం వాళ్ళది అనుకొంటాను. అక్కడనుండి భయం కలుగుతుంది. ఇద్దరుంటే భయం, ఉన్నది ఒక్కటే అయితే ఇంకా భయం ఏమిటి? ఉన్నది ఒక్కటే అని అనుభవంలోనికి వచ్చేవరకు వాడు భయరహితుడు అవ్వలేడు. భయం వలన శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం పాడవుతుంది. నువ్వు ఇతరులను చూసి భయపడకు, నువ్వు ఇతరులను భయపెట్టకు అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఇతరులను భయపెట్టటం ఎంత పొరపాటో, ఇతరులను చూసి నువ్వు భయపడటం కూడా అంతే పొరపాటు. ఇవి రెండూ కూడా వికారాలే. భయం అనేది మీకు ఆలోచనా శక్తిని తగ్గిస్తుంది. మీకు సంతోషాలు రానిియ్యి, భయం రానియ్యి. ఇవి అన్నీ

కూడా వారు వేరు, నేను వేరు అనే ద్వయీభావనలోనుండే వస్తాయి. మేము ఈ మధ్య సంతోషంగా ఉన్నామండి అంటారు. ఆ సంతోషం రెండు రోజులు ఉండి మూడవ రోజున పోతుంది ఏమిటి? ఆ సంతోషం నిజమైతే అది ఎప్పడూ ఉండాలి కదా మరి ఎందుకు ఉండటంలేదు? ఈ సంతోషాలు, దుఃఖాలు ఇవి ఏమీ నిజంకాదు. ఇవి మనస్సులో వచ్చే వికారాలు. సంతోషం కూడా మనస్సుకు వచ్చే పొంగు మాత్రమే. అది యదార్థంకాదు. ఒకవేళ సంతోషం వచ్చినా దానిని మీరు పట్టించుకోవద్దు. లోపల యోగ్యత లేనప్పడు, అర్హత లేనప్పడు మీరు సంతోషంగా ఉండండి అంటే ఉండగలరా? ఇంకోటి మీరు జ్ఞాపకం ఉంచుకోండి. బయట వ్యక్తుల నుండికాని, బయట వస్తువులనుండి గాని, బయట విషయాల నుండి గాని మీకు సంతోషం వస్తూ ఉంటే అది నమ్మకండి, అది నిజంకాదు. అలాగే దుఃఖం వచ్చినా నమ్మవద్దు. అదీ నిజంకాదు. అందుచేత బయటనుంచి వచ్చే సంతోషాన్ని గాని, దుఃఖాన్ని గాని మీరు పట్టించుకోవద్దు. సత్యం మీ హృదయంలోనే ఉంది. అందులోనే శాంతి ఉంది, ఆనందం ఉంది, ఉండటం ఉంది. ఏసు చెప్పిన స్వర్గరాజ్యం నీ హృదయంలోనే ఉంది. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని నువ్వు అనుభవైకవేద్యం చేసుకోవటమే నీ జీవిత గమ్యం. అయితే దానిని తెలుసుకోవాలనే కాంక్ష రావటం, ఆ జిజ్ఞాస రావటానికి గురువు అనుగ్రహం ఉండాలి. మనం గురువును పట్టుకోవటంవేరు, గురువు మనల్ని పట్టుకోవటం వేరు. మనం గురువుపట్ల ప్రేమగా ఉండవచ్చు, తరువాత మనం తప్పిపోవచ్చు. గురువు యొక్క ప్రేమ మనమీద ఉంటే, ఆయన అనుగ్రహం మన మీద ఉంటే ఇంక మనం తప్పిపోయే అవకాశం లేదు. మనం ఆయనను స్మరించటం వలన వచ్చే శాంతి వేరు, ఆయన మనలను తీసుకోవటం వలన వచ్చే శాంతి వేరు. ఆ వచ్చే కెరటం ఏదో అటువైపు నుండి రావాలిగాని ఇక్కడనుండి వచ్చేది ఏమీ లేదు. మనం గురువును స్మరించుకొంటున్నాము కాని ఆయన ఎప్పడైనా మనలను స్మరిస్తున్నాడా? గురువు యొక్క అనుగ్రహం అత్యంత బలీయమైనది. ఈ జ్ఞానమార్గంలో తరించటానికి గురువు అనుగ్రహం అత్యంత అవసరం. మీకు ఎప్పడైనా అనుభవాలు రావచ్చు, సంతోషాలు రావచ్చు, శాంతికూడా రావచ్చు. లేకపోతే మేము చాలా బాగున్నాము అని మీకు అనిపించవచ్చు. అక్కడితోటి ఆగిపోకండి. మనం మనస్సును ఓవర్‌కమ్ చెయ్యాలి.

బుద్ధుడు తన జీవితంలో ఏ సంఘటనకీ భయపడలేదు. కారణం అక్కడ అసలు ద్వైతం లేదు. ఉన్నది అద్వైతానుభవమే, ఉన్నది బ్రహ్మమే. ఎప్పడైతే నువ్వు బ్రాహ్మీస్థితిని

పొందావో అప్పుడు నువ్వు భయరహితుడవు అవుతావు. బ్రాహ్మీస్థితిని పొందినవాడికి ఈ సృష్టిలో భయపడనవలసింది అంటూ ఏమీ లేదు. ఒకసారి పెరుమాళ్ళస్వామి భగవాన్‌ను విమర్శిస్తూ ఒక ఉత్తరం వ్రాసాడు. ఈ ఉత్తరాన్ని కూడా మన లైబ్రరీలో పెట్టండి అని భగవాన్ చెప్పారు. ఆ ఉత్తరంలో మిమ్మల్ని తిట్టిపోసాడు అని భగవాన్‌తో చెప్పారు. భగవాన్ ఏమన్నారు అంటే అందులో ఏముంది తెల్లకాగితం మీద నల్ల అక్షరాలే కదా! అన్నారు. అదే మనకు అయితే ఉద్రేకం వచ్చేస్తుంది. భగవాన్‌కు ఎర్రచీమ కుట్టినట్లుకూడా లేదు. అందులో సత్యం లేదు. తెల్లకాగితం మీద నల్ల అక్షరాలు అంతే. ఒకవేళ పొగడ్తలు అయినా కూడా అంతే. భర్త చనిపోతే దుఃఖపడుతున్నారు. మరి విడాకులు తీసుకొన్నవాళ్ళ మాట ఏమిటి? విడాకులు తీసుకొన్నవారు ఏమౌతారు అంటే విడిపోతారు. చనిపోవటం కూడా ఒకరకమైన విడాకులు లాంటిదే, వారు శాశ్వతంగా విడిపోతారు. చావు బలవంతంగా మనుషుల్ని విడదీసేస్తుంది. ఒకరంటే ఒకరికి ఎంతో ఇష్టం ఉన్నా మరణం మిమ్మల్ని బలవంతంగా విడదీసేస్తుంది. అయితే మరణం గురించి బాధపడకండి. ఇదీ విడాకుల లాంటిదే, ఇది శాశ్వతమైన వీడుకోలు.

సంసారం అంటే మనస్సే సంసారం. మనస్సు లేకపోతే సంసారం లేదు. మనోనాశనం అయ్యేవరకు ప్రతీ జన్మలోను నిన్ను సంసారం వెంటాడుతుంది. దేహాన్ని కూడా మనస్సే కల్పించింది. దేహం వస్తే ప్రపంచం వస్తుంది, ప్రపంచం వస్తే దేవుళ్ళు వస్తారు. అక్కడ నుండి అడవి అంతా ప్రారంభమవుతుంది. ఈ రహస్యం అంతా ఎక్కడ ఉంది అంటే మనస్సులో ఉంది. మనస్సు ఉంటే అంతా ఉంది, అది అణిగిపోతే ఏమీలేదు. మనస్సు అణగటం వేరు, మనస్సు నశించటం వేరు. మనస్సు దాని మూలాన్ని అది చూస్తేనే కాని మనస్సు నశించదు. మాయ అంతా మనస్సులోనే ఉంది, బంధం అంతా మనస్సులోనే ఉంది. శరీరం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను అని చెప్పేది కూడా మనస్సే. మనస్సు నిజంగా చనిపోవటంలేదు, చనిపోయేది శరీరమే కాని ఆ శరీరంతో ఉన్న తాదాత్మ్యం వలన మనస్సు అలా చెపుతోంది. నేను, నాది అనేవి తలంపులు. ఇవే మనలను బంధిస్తున్నాయి. మీకు ఎవరిమీద అయినా కోపంగా ఉంటే మనస్సు చలిస్తుంది. మీకు ఎవరిమీద అయినా ఇష్టం ఉంటే మనస్సు చలిస్తుంది. మీకు ఇష్టాలు, అయిష్టాలు కనుక లేకపోతే ఇంక మనస్సు చలించదు. ఈ ఇష్టాలు, అయిష్టాలే పాపం అంతకంటే ప్రత్యేకంగా పాపాలు అంటూ ఏమీ లేవు. ఏ దేశం వెళ్ళి చూసినా, ఏ ప్రాంతం వెళ్ళి చూసినా, ఏ ఇంటికి వెళ్ళి చూసినా ఇష్టాలు, అయిష్టాలు తప్పించి ఈ సృష్టిలో ఏముంది అన్నాడు గౌతమబుద్ధుడు.

భయము, అసూయ, మోహం ఇవి అన్నీ కూడా ద్వైతంలో నుండే వస్తున్నాయి. ద్వైతభావనను నశింపచేసుకోవటమే జీవితగమ్యం. ప్రతీ చిన్నవిషయానికి రియాక్షన్ వస్తూ ఉంటే మానసిక ఆరోగ్యం చెడిపోతుంది. మీరు వండిన కూర బాగాలేదు అని ఎవరైనా అంటారు అనుకోండి వెంటనే మీకు కోపం వచ్చేస్తుంది. ఏమో ఒకవేళ బాగా లేదేమో అనుకొని దానిని సరిచేసుకోవటానికి ప్రయత్నం చేయాలి కాని ఎమోషన్‌కు గురికాకూడదు. అలా చేస్తూ ఉంటే మీరు వివేకవంతులవుతారు. ఆరోజుకారోజు వయస్సు వచ్చే కొలది మనిషి వివేకవంతుడు అవ్వాలి. పరిస్థితులు వచ్చినప్పుడు, సంఘటనలు వచ్చినప్పుడు మనకు ఎంతోకొంత వివేకం కనుక ఉంటే ఇది సత్యమా అసత్యమా, ఈ విషయాలకు ఆకర్షింపబడటం వలన వచ్చే పరిణామాలు ఏమిటి? ఇది విధి, ఇది నిషేధం, ఇది చెయ్యాలి, ఇది చెయ్యకూడదు అని విడదీసుకునేశక్తి మనకు కలుగుతుంది. చెయ్యరానిది చెయ్యటం ఎంత పొరపాటో, చెయ్యవలసింది చెయ్యకపోవటం కూడా అంతే పొరపాటు. ఇవి రెండూ బాగా గుర్తుపెట్టుకోండి. చెయ్యరానిది చెయ్యటం పొరపాటు అలాగే మనం చెయ్యవలసిన డ్యూటీ ఉన్నప్పుడు దానిని చెయ్యకపోవటం కూడా పొరపాటే. ఇదీ పొరపాటే, అదీ పొరపాటే.

భగవంతుడు ఏమని చెప్పాడు అంటే నువ్వు ప్రయత్నం చేసి, సాధన చేసి రాగము, భయము, కోపము ఈ మూడింటిని విడిచిపెట్టు. నువ్వు ప్రయత్నం చేసి యజ్ఞము, దానము, తపస్సు వీటిని ప్రాక్టీసు చెయ్యి. అంటే వీటిని సంపాదించుకో, వాటిని వదులుకో. రాగము అంటే మమకారం. మీ పిల్లవాడు బడినుండి ఇంటికిరావటం ఆలస్యమైతే ఏ లారీకిందపడి చనిపోయాడోనని వాడు రాకముందే మీకు బిపి పెరిగిపోతుంది. ఈ మమకారం ఉన్న వాళ్ళు అందరూ రోజుకు వందసార్లు చనిపోతున్నారు. మమకారం వల్లే భయం, మమకారం వల్లే చావు, మమకారం వల్లే పునర్జన్మ. మమకారం నరకహేతువు. మీ కుటుంబ సభ్యులపట్ల మీరు డ్యూటీ చెయ్యవచ్చు, కాని మమకారం పెట్టుకోవద్దు. కొంతమంది వారి నీడను చూసి వారే భయపడతారు. ఏమీ అధికారం లేకపోయినా గాంధీగారు ప్రపంచంలో అంత పాపులర్ అవ్వటానికి, ఆయన మహాత్ముడు అవ్వటానికి కారణం ఆయన భయరహితుడు. అక్కడ నేను, నాది అనేవి లేవు. నీకు భిన్నంగా ఏది కనిపించినా అందులో నుండి భయం వస్తుంది. నీ స్వరూపం కంటే భిన్నంగా చూడటానికి ఏముంది? నీ స్వరూపం కంటే భిన్నంగా ఏమీ లేదు కాని నీ స్వరూపం కంటే భిన్నంగా ఏదో ఉన్నట్లు నీ మనస్సు చూస్తోంది. ఇది మనస్సు చేసే గారడీ. ఉన్నదల్లా ఒక్కటే వస్తువు అయినప్పటికీ నీవు వేరు, నేను వేరు

అనే బేధబుద్ధిని కలిగించేది కూడా మనస్సే. ఇదంతా మనస్సే. కోపం కూడా మనస్సులో వచ్చే వికారం. చాలామందికి కారణం ఉండి కోపాలు రావు, ఇంట్లో జరుగుబాటుతనం ఉంటే ఎక్కువగా కోపాలు వస్తాయి. జరుగుబాటుతనం లేనివాడికి కోపం ఏమిటి? పాపం బీదవాడి కోపం ఎవరు పట్టించుకొంటారు. కోపం కూడా ఒక శత్రువు. ఇప్పడు నీకు దేహం ఎలా అనుభవంలో ఉందో, మనస్సు నీకు ఎలా అనుభవంలో ఉందో అలా నీ హృదయంలో ఉన్న నిజం నీకు అనుభవంలోనికి రాకుండా కోపం అడ్డు వస్తూ ఉంటుంది.

భగవంతుడు ఉన్నాడా లేడా, పునర్జన్మ ఉందా లేదా ఇవి అన్నీ ఒక ప్రక్కన పెట్టండి. మీరు దేవుడిని చూడటం కూడా ముఖ్యం కాదు. వాసనాక్షయం ఒక్కటే ముఖ్యం. వాసన లేకుండా తలంపు రాదు. తలంపు వచ్చాక మాట వస్తుంది, తలంపు వచ్చాక పని చేస్తాము. ఇదంతా వాసనామయం. అందుచేత మీలో ఏ వాసనలు ఉన్నాయో చూసుకొని వాటిని వేరుతో సహా నశింపచేయటమే మన జీవిత గమ్యం. మీకు శాంతి కావాలి అంటే, సుఖం కావాలి అంటే, మరల మీరు శరీరం ధరించకుండా ఉండాలి అంటే వాసనాక్షయం తప్పించి ఇంక ఏమీ లేదు. వాసనాక్షయం పూర్తి అయినవాడికి స్వర్గంలేదు, నరకంలేదు, ఇంక వాడికి ఇతర లోకాలకి ప్రయాణం లేదు, మరల శరీరాలు ధరించవలసిన పనిలేదు. గురువు మనకు చేసే సహాయం అదే. అయితే గురువుకు మీ పట్ల ప్రేమ ఉన్నా, ఆప్యాయత ఉన్నా ఆ వాసన పోయేటప్పడు దాని తాలూక ఎరుక మీకు లేకుండా ఆ వాసనను తీయటానికి అవకాశం లేదు. అయితే మీరు ఆవాసనతోటి పది సంవత్సరాలు బాధపడవలసింది, మీ హృదయంలో ఉన్న ఆ వాసనను మెదడులోనికి తీసుకొనివచ్చి, దాని తాలూక అశాంతిని మీ చేత అనుభవింపజేసి తరువాత దానిని కాల్చి బూడిద చేస్తాడు, అది గురువు చేసే సహాయం. మేము సుఖంగా ఉన్నాము అని చాలామంది అంటారు. ఎన్నాళ్ళు సుఖపడతారు. ఇంట్లో సుఖంగా ఉందని మీ శరీరాలు ఎప్పడూ ఇలాగే ఉంటాయా? మిగతా విషయాలు అన్నీ మర్చిపోండి, వాసనాక్షయం ఒక్కటే ముఖ్యం. మీరు ఇంటికి వెళ్ళిపోయి ఏ వాసన మిమ్మల్ని ఇబ్బంది పెడుతోందో చూసుకొని, దానిని కాల్చి బూడిద చెయ్యటమే మీ జీవితగమ్యం. మిగతా విషయాలు మీకు సంతోషం రానివ్వండి, అది టెంపరరీ, మీకు దుఃఖం రానివ్వండి, అదీ టెంపరరీ. ఇవన్నీ ఒక కాలంలో వస్తాయి, ఇంకో కాలంలో పోతాయి. ఇవన్నీ నిలబడేవి కాదు. వాసనాక్షయం ముఖ్యం. అక్కడ మనకు డివైన్ ఇంటర్‌ఫియరెన్స్ అవసరం.

యజ్ఞ, దాన, తపస్సులను అలవాటు చేసుకోమని చెప్పారు. ఫలకాంక్ష లేకుండా

మీరు ఏ పని చేసినా అది యజ్ఞమే. మీరు స్వార్థం లేకుండా ఎదుటివారికి ఏదైనా మాట సహాయం చేసారు అనుకోండి, అది కూడా యజ్ఞమే. ఆ జీవకోటి రూపంలో ఉన్నవాడు ఈశ్వరుడే. నువ్వు ఇతరులకు ఇచ్చింది తిరిగి నీకే వచ్చేస్తుంది, అది మీకు తెలియక మేము ఏదో త్యాగం చేస్తున్నాము అనుకొంటారు. మీరు చేసిన త్యాగాలకు సాక్షి సూర్యుడు. మీరు ఎవరికైనా ఏదైనా సహాయం చేస్తే సూర్యుడు వాడి బ్యాంక్‌లో ఉంచి మరల ఏదో జన్మలో మీకు తిరిగి ఇచ్చేస్తాడు. ఇంక ఇందులో త్యాగం ఏముంది? అంటే మీరు బ్యాంక్‌లో డబ్బు దాచుకొని మేము ఏదోత్యాగం చేసాము అనుకొంటే ఎలాగ? మీరు ఇతరులకు చేసిన సహాయం కూడా అటువంటిదే. ఛారిటీ వల్ల ప్యూరిటీ రావాలి. మీరు చేసే ఛారిటీ నిజమైతే దాని వలన మీ మనస్సు పవిత్రం అవ్వాలి. మీ కుడిచెయ్యి చేసేది ఎడమచేతికి తెలియనివ్వకండి అన్నాడు ఏసు. అంటే నువ్వు చేసే పని కామ్‌గా ఉండాలి, క్వయిట్‌గా ఉండాలి, కూల్‌గా ఉండాలి. స్వార్థం లేకుండా పనులు చేసేటప్పుడు కొంతమంది ఎన్నో అవమానాలు ఎదుర్కొంటారు. అయినా లోకక్షేమం కోసం ఏదో ఒకటి చేస్తూనే ఉంటారు. ఆ చేసేది ప్రశాంతంగా చేస్తారు. దానివలన వారి మనస్సు పరిశుద్ధమవుతుంది. అది ఛారిటీ. ఏదైనా ఒక విషయాన్ని ఆలోచించేటప్పుడు నువ్వు దానిని దర్శించగలిగితే అంటే బ్రెయిన్‌తో ఆలోచించేది నువ్వు కళ్ళతో దర్శించగలిగితే అప్పుడు నీకు బ్రెయిన్‌లో క్లారిటీ వస్తుంది. మీకు బ్రెయిన్‌లో వచ్చే క్లారిటీ ఛారిటీ కంటే గొప్పది.

తపస్సు అంటే ఎండింపచేయటం. కిరసనాయిల్ డబ్బాను నాలుగుసార్లు కడిగినా ఆ వాసన పోదు. నాలుగు రోజులు ఎండలో పెడితో ఆ వాసన పోతుంది. అలాగే మీకు పునర్జన్మను తీసుకొని వచ్చే కారణాలను ఎండింప చేయాలి. అదే తపస్సు. కంచి పరమాచార్య గారికి, గాంధీ గారికి గొప్ప ఆహారనియమం ఉండేది. ఇప్పుడు మన చెయ్యి ఇలా ఉంది అనుకోండి, నువ్వు దానిని కదలకు అంటే అది కదలదు. అలాగే వారు మనస్సును నువ్వు కదలకు అంటే అది కదలదు. అంటే మనస్సుకు అటువంటి శిక్షణ ఇచ్చారు. వారు చాపలమీద పడుకొన్నా సుఖంగా నిద్రపోతారు అంటే శరీరాన్ని ఎక్కువగా సుఖపెట్టరు. శరీరాన్ని ఎక్కువగా సుఖపెడితే అది సాధనకు ఉపయోగపడదు అని. శరీరం ద్వారా మనం ఏది సాధించాలి అదే వారి దృష్టిలో పెట్టుకొంటారు కాని కేవలం కంఫర్టు కాదు. శరీరాన్ని ఎక్కువ కంఫర్టులో ఉంచటం కంటే మైండ్‌ను బాగా కంట్రోల్ చేసుకోవాలి. అంటే శరీరానికి ఉన్న కంఫర్టు కంటే మైండ్‌కు ఉన్న కంట్రోల్ వలన వారు ఎక్కువ శాంతిని పొందుతారు.

మీకు శరీర ధ్యాస ఉన్నప్పుడే భయం కలుగుతుంది. నిద్రలో ఎవడికీ భయం ఉండదు. ఎందుచేతనంటే అక్కడ ద్వితీయం లేదు. జ్ఞానికి మనకీ ఇక్కడే తేడా ఉంది. నిద్రలో మనకు ఏ నేను అయితే ఉందో ఆ నేను జాగ్రదవస్థలో జ్ఞానికి అనుభవంలో ఉంటుంది. ఇప్పుడు మనం చెప్పే నేను నిద్రలో ఉన్న నేను కాదు. దీనికి శరీరం ఉంది. ఈ నేనుకు పుణ్యపాపాలు ఉన్నాయి, చావు పుట్టుకలు ఉన్నాయి, స్నేహాలు విరోధాలు ఉన్నాయి, దేవుడు దేవతలు ఉన్నారు, స్వర్గం నరకం ఉంది, ఈ నేనుకు అన్నీ ఉన్నాయి. కాని నిద్రలో ఉన్న నేనుకు ఏమీ లేదు. దానికి శరీరం లేదు, దేవుడి గొడవ లేదు, ఏ గొడవ లేదు. ఒక్క జ్ఞానికి మాత్రమే ఈ నేను జాగ్రదవస్థలో అనుభవంలో ఉంటుంది. గాఢనిద్రలో ఉన్న నేను జాగ్రదవస్థలో అనుభవంలోనికి వచ్చినప్పుడు వాడు నిజమైన సుఖి అవుతాడు. మీలో కనీసం ఒక్కరైనా ఆ స్థితిని పొందితే, ఆ స్టేట్‌ను అనుభవైకవేద్యం చేసుకొంటే మీ ద్వారా కోట్లాది మంది బాగుపడతారు. మీ శక్తి సముద్రాలు దాటి వెళుతుంది. సూర్యుడు చంద్రుడు ఉన్నంతకాలం మీరు చెప్పిన మాటలు జీవించి ఉంటాయి. తాత్కాలికంగా మీరు ఏదైనా కష్టాలు పడినా, ఏవైనా అవమానాలకు గురి అయినా అంతిమంగా జయించేది సత్యం మాత్రమే. ధర్మరాజు మంచివాడే. ఆయన చేయవలసిన పనులు ఏవో చేసాడు. ఏదో వాడి పని వాడు చక్కబెట్టేసుకొన్నాడని వాడికి మోక్షం వచ్చేయదు. ఈశ్వరుని పొందటానికి మనం అదనంగా కొన్ని పనులు చెయ్యాలి. ఆయనపట్ల భక్తి కలిగి ఉండాలి. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడని ఆయనపట్ల పరిపూర్ణమైన విశ్వాసం కలిగి ఉండాలి. ఆయన నామం మన హృదయంలో ఉండాలి. ఆయనకు ప్రీతి కలిగించే పనులు చేయాలి.

కర్త ఈశ్వరుడే, కర్తని నేనుకాదు. రామకృష్ణుడు చెప్పిన ఈ వాక్యాన్ని మీ హృదయంలో పెట్టుకొని తాళం వేసేసుకోండి. ఈశ్వరుడే కర్త, కర్తను నేను కాదు అని నోటితో చెప్పటంకాదు, అది నీకు అనుభవంలోనికి వస్తే నువ్వు జీవన్ముక్తుడవు అవుతావు, అంటే ఈ శరీరం పడిపోకముందే నువ్వు మోక్షసుఖాన్ని పొందుతావు. గురువు మిమ్మల్ని స్మరిస్తూ ఉంటే, గురువు అనుగ్రహం మీ హృదయాన్ని తాకుతూ ఉంటే అప్పుడు మీ హృదయంలో ఉన్న ఆనందసముద్రం పొంగి మీ సహస్రారాన్ని ముంచేస్తుంది, అప్పుడు మీకు ఊపిరి ఆడదు. గంటముందు మన మనస్సు ఇలా ఉంది కాని ఇప్పుడు ఇంత శాంతిలో కూరుకునిపోతున్నాము ఏమిటి అని మీకు అనిపిస్తుంది. ఇది మన సొంతంకాదు, ఇదంతా గురువే చేస్తున్నాడు అని అప్పుడు మీకు అర్థమవుతుంది. మీరు పెద్దగా కష్టపడనక్కరలేదు. భగవంతుడు అనేవాడు

ఒకడు ఉన్నాడు అనే విశ్వాసం నూటికి నూరుపాళ్ళు కుదిరితే సరిపోతుంది. మీకు నూటికి యాభై మార్కులు వచ్చేస్తాయి. మాకు సుఖం లేదు, మాకు శాంతిలేదు అని ఇప్పుడు చాలామంది అంటూ ఉంటారు. మీరు ఆత్మజ్ఞానాన్నిపొందితే ఇప్పుడే ఈ శరీరంలో ఉండగానే మీరు భరించలేనంత శాంతి వచ్చి మిమ్మల్ని ముంచేస్తుంది. మీరు మారుమనస్సును పొందుతారు. పూర్వం మీరు కష్టపడి ఉన్నా, ఎప్పుడైనా దుఃఖానికి గురి అయినా అది అంతా ఊరికే మిధ్యకింద మీకు కనిపిస్తుంది. మనం ఎందుకు ఇంత కష్టపడ్డాము? ఎందుకు ఇంత దుఃఖపడ్డాము? ఇంత తెలియనితనంగా బతికాము ఏమిటి? ఇంత బాధ పడ్డాము ఏమిటి? అని మీకు జ్ఞానం వచ్చాక అనిపిస్తుంది. మీ అత్తగారు ఏదో అన్నారు, లేకపోతే మీ మావగారు ఏదో అన్నారు. ఆ మాటలు జ్ఞానమా? వాటి గురించి మనం దుఃఖపడుతున్నాము ఏమిటి? మీకు రీలైజేషన్ రాగానే ఏమనిపిస్తుంది అంటే ఏమీ కారణం లేకుండా, ఏమీ అవసరం లేకుండా ఏవో కల్పించుకొని మనం దుఃఖపడుతున్నాము అని మీకు తెలుస్తుంది. జరిగిపోయినదంతా ఒక స్వప్నంగా అయిపోతుంది. మనం పడ్డ దుఃఖం నిజంకాదు, కల్పించుకోవటం వలన అలా అనిపిస్తుంది. ఏమీలేని దానికి కంగారుపడి పోతున్నారు. అంత దుఃఖపడేది అక్కడ ఏముంది? వచ్చేటప్పుడు ఏదో వస్తోంది, ఏదో వస్తోంది అనుకొంటాము. పోయేటప్పుడు ఏదో పోతోంది, ఏదో పోతోంది అనుకొంటాము. వచ్చేదీ నిజంకాదు, పోయేదీ నిజంకాదు. ఊరికే మన మనస్సుకు అలా అనిపిస్తూ ఉంటుంది.

మీరు హృదయంలో జీవించటం నేర్చుకోండి. హృదయంలో జీవించటం నేర్చుకుంటే మనస్సు కరిగిపోతుంది. అశాంతి, ఆందోళన ఎక్కడ ఉన్నాయి అంటే మనస్సులో ఉన్నాయి. ఈ గందరగోళం అంతా మనస్సులోనే ఉంది. అందుచేత మనస్సు అణిగిపోతే ఇవి అన్నీ అణిగిపోతాయి. నువ్వు మాట్లాడే మాటలోగాని, నీ జీవన విధానంలోగాని ఎక్కడా ఆడంబరం లేకుండా జీవించటం నేర్చుకొంటే నీకు అక్కరలేని విషయాలు, అక్కరలేని తలంపులు, నీకు ఉపయోగంలేనివి అన్నీ కూడా వాటంతట అవే రాలిపోతాయి. నువ్వు నేను, నేను అంటున్నావు కదా. ఆ నేను ఎవరో కొంచెం గమనిస్తూ ఉండు. ఆ నేను గురించి నువ్వు విచారణ చేయకపోతే, శరణాగతి అయినా మంచిదే. అది అలా ఎందుకు జరిగింది, ఇలా ఎందుకు జరిగింది అని కొంతమంది అడుగుతూ ఉంటారు. ఈశ్వరుడి మీద మీకు తగినంత విశ్వాసం లేనప్పుడే ఈ ప్రశ్నలు వస్తాయి.

మీకు ఎవరూ అవరోధం కాదు, ప్రతీ దానికి నేను కర్తను అనుకోవటమే పెద్ద

అవరోధం. నీ అహంకారమే నీకు అవరోధం. బయట అవరోధాలు ఏమీలేవు నీకు ఉన్న అజ్ఞానమే నీకు అవరోధం. నీ మనస్సే నీకు అవరోధం కాని బయట ఏమీ లేదు. నీకు నువ్వే అవరోధంకాని బయటవారు ఎవరూ నీకు అవరోధంకాదు. నీకు ఉన్నతలంపులే, నీ సంస్కారాలే నీకు అవరోధం కాని బయటవారు నీకు అవరోధం కాదు. మీకు కోరికలు వస్తూ ఉంటాయి. చాలామంది ఆ కోరికలను నెరవేర్చుకొంటారు. మీకు సినిమా చూడాలని కోరిక ఉంది అనుకోండి, వెళ్ళి చూసి వచ్చేస్తారు. అలా చూసిరావటంవలన సినిమా చూడాలనే కోరిక పోతుందని మీరు అనుకోవచ్చు. చూసి వచ్చేసాము కదా అని అది తగ్గదు, అది పెరుగుతూ ఉంటుంది. జాగ్రత్తగా వినండి. మీకు ఏదైనా కోరిక వచ్చినప్పుడు దానిని సాటిస్ఫై చేస్తే అది పెరిగిపోతుంది. దానిని సాటిస్ఫై చేయకపోతే తగ్గిపోతూ ఉంటుంది. కోరికను సంతృప్తి పరచటం వలన అది తగ్గిపోతుందని మీరు ఎప్పుడూ అనుకోవద్దు. ఒక కోరిక నెరవేర్చారు అనుకోండి అది అక్కడితోటి ఆగదు, నెరవేరిన కోరిక ఇంకా మిగతా కోరికలను తీసుకొని వస్తుంది. నువ్వు ఆ కోరికను నెరవేర్చావు కదా మమ్మల్ని కూడా నెరవేర్చమని అవి అడుగుతాయి. పొయ్యిలో నిప్పు ఉంది. మీరు కొత్తగా కట్టెలు పొయ్యిలో పెట్టకండి. కొత్తగా కట్టెలు పెడితే నిప్పు పెరిగిపోతూ ఉంటుంది. కట్టెలు పెట్టటం మానేసారు అనుకోండి ఉన్న కట్టెలు ఏవో మండి పొయ్యి ఆరిపోతుంది. అలాగే మీకు ఉన్న వాంఛలు ఏవో ఉన్నాయి. వాటిని నెరవేర్చకుండా ఉంటే అవి నెమ్మదిగా తగ్గిపోతాయి, కొత్త వాంఛలు రావు. ఆ టెక్నిక్ మీరు నేర్చుకోండి, ఆ విశ్లేషణ మీకు ఉండాలి.

ఉద్రేకంగా ఉన్నప్పుడు మీరు ఎప్పుడూ నిర్ణయాలు తీసుకోవద్దు. ఒకరోజు ఆగండి. ఉద్రేకంగా ఉన్నప్పుడు నిర్ణయాలు తీసుకొంటే సరిగా ఉండవు. అందుచేత మీరు ఏమి చేస్తారు అంటే మీ మనస్సు ప్రశాంతంగా ఉండటంకోసం, దానికి ఏకాగ్రత కలగటం కోసం ఏదో ఒక వస్తువును ధ్యానం చేయండి. అరుణాచలాన్ని కాని, అవతారపురుషుడిని కాని తీసుకొని మీరు నిరంతరం ధ్యానం చేయండి. ఒకే వస్తువును నిరంతరం చింతించటం వలన మనస్సు నశిస్తుంది. ప్రహ్లాదుడికి అలా నశించింది. తుకారామ్ నిరంతరం పాండురంగడిని ధ్యానం చేయటంవలన ఆ భక్తి ప్రవాహంలో నేను అనే తలంపు పోయింది. పాండురంగడిని ప్రేమించగా ప్రేమించగా పాండురంగడే ఉన్నాడు, నేను లేను అని ఆయనకు అర్థం అయ్యింది. ఇప్పుడు మనం ఏమనుకొంటున్నాము అంటే దేవుడు లేడు, మనం ఉన్నాము అని అనుకొంటున్నాము. ఇష్ట దేవతను నిరంతరం స్మరించటం వలన నేను లేను,

ఆయనే ఉన్నాడు అనేటువంటి అనుభవం కలుగుతుంది. భక్తులు చాలామందికి అటువంటి అనుభవాలు వచ్చాయి, వాళ్ళు మోక్షాన్ని పొందారు. రమణమహర్షిగారు మరణానుభవం ద్వారా మరణాన్ని జయించి మరణంలేనిస్థితిని పొందారు. ఆ స్థితి రమణమహర్షిగారి సొత్తుకాదు, రామకృష్ణపరమహంసగారి సొత్తుకాదు. మీరు పొందవచ్చు, అది వారసత్వంగా వచ్చే హక్కుకాదు. రామకృష్ణుడు, భగవాన్ ఏ స్థితిని అయితే పొందారో ఆ స్థితిని మీరు కూడా పొందవచ్చు. దానిని పొందటం కోసమే ఈ టీచింగ్ అంతేగాని ఏవో కాలక్షేపం మాటలు కాదు. రామకృష్ణుడు జీవితం పొడుగునా బోధించాడు. ఆయన నులకమంచం మీద కూర్చుని ఎందుకు చెప్పినట్లు అంటే ఆయన పొందినస్థితిని మీచేత పొందింపచేయటానికే ఆ బోధ అంతా, మిమ్మల్ని ఆనందప్రవాహంలో ఊగిసలాడించటానికే ఆ టీచింగ్ అంతా, ఈ శరీరాలు మరణించినా మీరు సుఖంగా ఉంటారని, ఆ ఉండటం అనేది మీకు అనుభవంలోనికి తీసుకొనిరావటానికే వాళ్ళు జీవితం పొడుగునా అదే పనిగా మీకు బోధించారు. వారు ఏ స్థితిని అయితే పొందారో అందులో నుండి మనపట్ల హద్దులు లేని దయకలిగి, వారు పొందిన ఆనందాన్ని శాంతిని దయతో మనకు మాటల రూపంలో చెప్పారే కాని ఇంకో ప్రయోజనం ఏమీలేదు. వారు పొందిన స్పిరిట్యువల్ స్టేటస్ మీరందరూ పొందాలి అని మానసికంగా మినహాయింపులు లేకుండా డెడికేటెడ్‌గా చెప్పారు.

మనం పెద్దవారిని ఉపయోగంలేని ప్రశ్నలు అడగకూడదు. ఒకరు రామకృష్ణుడితో ఏమన్నారు అంటే మీరు బ్రాహ్మణులు, వివేకానంద రాజులు. మీరు వివేకానందకు ప్రత్యేకంగా బోధ చేస్తున్నారు, ట్రైనింగ్ ఇస్తున్నారు. మీరు బ్రాహ్మణులు అయి ఉండి ఇంకో బ్రాహ్మణుల అబ్బాయికి ట్రైనింగ్ ఇవ్వాలి కాని వివేకానందకు ఇస్తున్నారు ఏమిటి అని రామకృష్ణుడిని అడిగారు. అప్పుడు రామకృష్ణుడు ఏమి ఉద్రేకపడలేదు. నువ్వు చెప్పింది బాగానే ఉంది. ఇటువంటి కళ్యాణగుణాలు ఉన్నవాడిని, సమగ్రత ఉన్నవాడిని, ఇటువంటి అబ్బాయిని నువ్వు బ్రాహ్మణులలో ఇంకో అబ్బాయిని తీసుకొనివచ్చి నాకు చూపించు, అప్పుడు వాడికి కూడా చెపుతాను. నాకు అభ్యంతరం లేదు అని చెప్పాడు. మీ శిరస్సు మీద అనుగ్రహవర్షం కురిపించటమే. అది కొలతలు కాదు. కులానికి సంబంధించిన, మతానికి సంబంధించిన మినహాయింపులు లేకుండా అందరి శిరస్సులమీద వాళ్ళ అనుగ్రహాన్ని వర్షం కురిసినట్లు కురిపించారు. షిరిడీసాయిబాబా ఏమన్నారు అంటే మీరు హృదయం యొక్క లోయలలోనికి వెళ్ళాలంటే సహనం, శ్రద్ధ ఇవి రెండూ ముఖ్యం అని షిరిడీసాయిబాబా జీవితం పొడుగునా బోధించారు.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# అనుగ్రహం

మనము కోరుకున్న విధంగా ఏదైనా మంచి జరిగితే పరమాత్మ లేదా గుర్వనుగ్రహం వల్ల జరిగిందని, ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుంటాం! అదేవిధంగా ఏదైనా చెడు జరిగినప్పుడు పరమాత్మను లేదా గతజన్మకర్మలను నిందించి, పరమాత్మ అనుగ్రహం మనపట్ల లేదని భావిస్తాం! కాని అనుగ్రహం అనేది మనం కోరుకున్నవిధంగా మంచి జరిగినప్పుడు మాత్రమే అప్పుడప్పుడు వ్యక్తమయ్యేది కాదు. కేవలం ఉనికికి, మోక్షస్థితికి, పరమాత్మకు, గురువుకు, చైతన్యానికి, మరోపేరే అనుగ్రహం. "కేవలం ఉన్నదే అనుగ్రహం. అనుగ్రహం తప్ప ఇతరము లేనే లేదు. అది అందరిపట్ల సమానముగా నిరంతరం ప్రసరిస్తూ ఉంది. మనకు ఎదురయ్యే కష్టాలకు, దుఃఖానికి కారణం మన దేహాత్మబుద్ధేకాని, అనుగ్రహం లోపించడం వల్లకాదు. దేహాత్మబుద్ధిని అతిక్రమించి, వాస్తవంగా తానెవరో? అనుభవైకవేద్యం అయితే, అప్పుడు అక్కడ వ్యక్తం అయ్యేది అనుగ్రహమే, దాని స్వరూపం పరమశాంతి" అంటారు భగవాన్ శ్రీరమణమహర్షి. అనుగ్రహం నిరంతరం ఉన్నదే అయినా మన దేహాత్మబుద్ధి, కోరికలు, వాసనలు కారణంగా దానిని గుర్తించలేకపోతున్నాము. పరిపూర్ణ శరణాగతని లేదా విచారణ ద్వారా వ్యక్తిభావనను దాని మూలంలో నశింపజేస్తే అప్పుడు కేవలం ఉన్నదే అనుగ్రహం, అదే నా స్వరూపం అన్న సత్యం అనుభవైకవేద్యం అవుతుంది. అప్పుడు నిరంతరం అనుగ్రహంలోనే ఉంటాము. శరణాగతి చెందినవాడు ఏది మంచి అనిగాని, చెడు అనిగాని భావించడు, ప్రతీది పరమాత్మ ఇచ్ఛగానే భావించి ఎదురయ్యే ప్రతి సంఘటనను పరమాత్మ ప్రసాదంగానే స్వీకరిస్తాడు. మన దేహప్రారబ్ధం ఎలా ఉన్నా మనస్సుకి అంతర్దృష్టి కలగడం, నేనెవరో? తెలుసుకోవాలన్న తపన కలగడం, సద్గురువు లభించడం, తద్వారా మనోనాశమునకు ప్రయత్నించడం, ఇవన్నీ అనుగ్రహానికి నిదర్శనాలు. మనస్సు వ్యక్తిభావన ద్వారా వేరుతనాన్ని కల్పిస్తే, గుర్వనుగ్రహం అట్టి వేరుతనాన్ని పోగొట్టి వాస్తవంగా తానెవరో? ఎరుకపరుస్తుంది.

ఓంతత్సత్

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# సత్య దర్శనానికి పట్టుకొమ్మ ప్రేమ - అహింస

సత్యమే భగవంతుడు. ఈ సృష్టిలో ఆయన తప్ప ఏదీ వాస్తవమైనది, శాశ్వతమైనది కాదు. ప్రతీదీ మార్పు చెందేది, నశించేది. గీత అహింసను చెబుతుంది. మనలను మనం తెలుసుకోమని చెపుతుంది. ప్రేమ అంటే ప్రార్థన అది సత్యానికి సంబంధించిన ఆనందం. అది స్త్రీ, పురుషుల మధ్య జీవ రసాయన పరంగా సాగే ఆకర్షణ కాదు. బాపూ "మానవ జన్మకు ఆధారభూతం వీర్యం, దాన్ని చక్కగా కాపాడుకొంటే అసమాన శక్తి లభిస్తుంది" అన్నారు. నిజమైన దైవీ ప్రేమ అనిర్వచనీయంగా ఉండిపోతుంది. ఆ ప్రేమ అర్థంకానిదిగా మిగిలిపోతుంది. మనకు ప్రేమను జనులు వికృతమైన జంతుసహజమైన కామంగా దిగజార్చారు. ప్రేమ మనకన్న పెద్దది. మనం గురు ప్రేమకు బంధింపబడి ఉండాలి. ప్రేమ అంటే బురదలోంచి వచ్చిన కమలం. బురదలోంచి వచ్చిందని దాన్ని నిందించలేము. మొదట ప్రేమ జన్మించినది కామం నుండే. అందుకే "కామికాని వాడు మోక్షకామి కాలేడు" అంటారు. అది ప్రాథమిక దశ. ఈ విషయంలో తులసీదాసు, వేమన మొదలైన వారు గుర్తుకు వస్తారు. దైవీప్రేమ లేకుండా దేవుణ్ణి చేరుకోలేము. మనకు తెలుసున్నా, తెలియకపోయినా అవతార పురుషుడు లేదా గురువు ఈ క్రియలో తప్పనిసరిగా రావలసిందే. గురుదేవుల జ్ఞాన నేత్రాలను ఆర్తితో ప్రేమపూర్వకంగా చూస్తూ ఉంటే దాని ఫలితం మనకు తెలియకపోయినా ఆ ఛాయాచిత్రంలోని కళ్లను మనం సజీవంగా భావిస్తే అవి మనలను సత్యదర్శనానికి చేరుస్తాయి. ఈ విషయంలో శ్రీ నాన్నగారు "ఈ ప్రక్రియ చాలా ఫలవంతమైనది. కారణం మనస్సుకు రూపం అంటే బహు ఇష్టం" అన్నారు. ఆ విశ్వాసం మనకు తప్పనిసరిగా అవసరం. అది సులభమైనది కావటం వల్ల సత్యం దర్శనమౌతుంది. అది సత్యానికి మనకు వారధిలా ఉపయోగపడుతుంది. మన మనస్సు అజ్ఞానమనే చీకటిలో ఉంది. దానితోనే మనం జీవిస్తున్నాము. మనస్సును వెలుతురుతో రూపాంతరం చెందాలంటే మన దగ్గర వెలితి ఉంది. తత్వశాస్త్రాన్ని గురించి చాలా ఆశక్తిగా ఉంటాము. అది ఖర్చు లేనిది. అందమైన పదాలతో ఆ శక్తి కలుగుతుంది. అలా చదివితే పాండిత్యం వస్తుంది. అవి అన్నీ చిలకపలుకులే. మనం మూఢాచారాలు, గుడ్డి నమ్మకాలతో ఉన్నాము. హృదయ వైశాల్యము మనకు ఉందా! ఈ సృష్టి అంతా భగవంతునితో ఆశ్ఛాదితమై యున్నది. ఈ సృష్టినంతా ప్రేమిస్తే సత్యదర్శనమౌతుంది. మన మనస్సు ఇష్టా-అయిష్టాల పరిమితితో ఉంది. ఈశ్వర ప్రేమలేదు. వేదాల మొత్తం సారాన్ని కాళిదాసు "చేతనైతే ఉపకారం చెయ్యి అపకారం చెయ్యకు" అన్నారు. ప్రతీ మనిషి ప్రాథమిక దశలో తెలియక అపకారం చేస్తాడు. సత్‌ప్రవర్తనలోకి వచ్చాకే ఈశ్వరుడు వాటి ఫలితాలను అనుభవించేలా చేస్తాడు. హింస మానవుణ్ణి క్రూరమైన విభేదాలను సృష్టించే పైశాచిక ప్రవృత్తిని పురిగొలుపుతుంది. వారు అంతిమ సమయంలో క్షోభకు గురి అవుతారు. ప్రేమమయుడి జీవితాన్ని చూచి అందరూ ఆనందిస్తారు, స్వార్థంతో కుటిలత్వంతో కాపురాలను విడదీసే హింసాపరుల జీవితాన్ని అందరూ అసహ్యించుకొంటారు. ఈ సృష్టి అంతా భగవంతుని ప్రేమలో నిండి ఉంది అని గ్రహిస్తే హింస చెయ్యరు. తేలికైన మనస్సే స్వచ్ఛంగా ఆనందంగా ఉంటుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**